# ఫెంగ్ షుయి



## నవ్వుతున్న బుద్ధుడు

నవ్వుతున్న బుద్ధుని విగ్రహం ఇంట్లో ఉంటేచాలు., సంపద, శాంతి లభిస్తాయి. నవ్వే బుద్ధుడిని చాలా మంది తమ ప్రేమికుడిగాను, స్నేహితుడిగాను భావిస్తున్నారు. ఇంట్లో ఉంచుకునే బుద్ధుడి బొమ్మకు పెద్ద పొట్ట, నవ్వుతున్న ముఖం ఉండటం చాలా ముఖ్యం. నవ్వుతున్న ముఖం సంతోషానికి, పెద్ద పొట్ట సంపదకు చిహ్నం.

### సంపద చేకూరాలంటే..

- ★ నవ్వుతున్న బుద్ధుని విగ్రహాన్ని సంపదనిచ్చే దేవుడిగా భావిస్తున్నారు. అయితే ఈ విగ్రహానికి ఎలాంటి పూజలు చేయరు.
- ★ నవ్వుతున్న బుద్ధుని విగ్రహాన్ని ఇంట్లో ఎక్కడపడితే అక్కడ ఉంచకూడదు. ఇంటి ప్రధాన ద్వారానికి ఎదురుగా 30 అంగుళాల ఎత్తులో ఉండే విధంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఇలా ఏర్పాటు చేయడం వలన ఇంట్లోకి ప్రవేశించే అనుకూల శక్తిని ఈ విగ్రహం ఆహ్వానిస్తుంది. ఉత్తేజ పరుస్తుంది. దీంతో ఆ ఇంట సంపద రెట్టింపవుతుంది.
- ★ ఒకవేళ ప్రధాన ద్వారానికి ఎదురుగా విగ్రహాన్ని పెట్టుకునే వీలు లేకపోతే? అలాంటి సందర్భాలలో ప్రధాన ద్వారం దాటగానే హాలులోని మూలల్లో ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే బుద్ధుని ముఖం మాత్రం గుమ్మం వైపే ఉండాలి.
- ★ ఈ విగ్రహాన్ని పడకగదిలో, భోజనాల గదిలో ఉంచుకోరాదు.

ఈ జాగ్రత్తలు పాటించి నవ్వుతున్న బుద్ధుని విగ్రహాన్ని మీ ఇంట ఏర్పాటు చేసుకోండి. సిరిసంపదలకు ఆహ్వానం పలకండి.

*

వారం వారం 'ఫెంగ్ షుయి' మీకోసం!

# 'సరసి' కత

వైశంపాయనుడిని ఆటపట్టించాలనుకున్నారు అతడి తోటి ఆఫీస్ స్టాఫ్. అతగాడు ఆరోజు ఆఫీసుకు లేటుగా వచ్చాడు. ''నీకోసం ఒకావిడెవరో చంటి పిల్లాణ్ణి ఎత్తుకు వొచ్చిందయ్యా ఇందాకా. ఈనెల నువు డబ్బులు పంపలేదటగా? అన్నట్టు, ఆ పిల్లాడు అచ్చం నీ పోలికే సుమా!'' అన్నాడు కోలీగ్ అనిరుద్ధుడు.

వైశంపాయనుడు ఒక్క క్షణం స్తబ్దుడైనా తర్వాత ఫక్కున నవ్వేశాడు. ''ఏడిశావులే. మనకలాంటి వాళ్లెవరూ లేరు'' అంటూ తన సీట్లో కూర్చున్నాడు. అతడు కూర్చున్నాడు కానీ అతడి మనసు మాత్రం కూర్చోలేదు. ''ఏది ఎక్కడుంది?'' అనడిగేడు పక్కవాడిని.

''ఇంతవరకూ చూసి చూసి నువ్వింక రావనుకుని మీ ఇంటికి వెడతానని వెళ్లింది. పైకి అమాయకుడిలా కనిపిస్తావు గానీ, నువ్వు తక్కువ వాడివి కాదురోయ్!!'' అన్నాడు పక్కనున్న పాంచజన్యం.




## అమాయకుడు

వైశంపాయనుడికి కంగారు పట్టుకుంది. ఎవరామె? కొంపతీసి ఇంటికి గాని వెళ్లి నానా కూతలు కుయ్యదు కదా? ఒకవేళ ఆ కూతల్ని తన భార్య సుబ్బాయమ్మ నమ్మితే? అనుకుంటూ ఇంటికి ఫోన్ చేశాడు. ఎంతకీ భార్య ఫోను తియ్యలేదు. తీశాక, ''ఏం చేస్తున్నావ్? ఫోను తియ్యడానికి ఇంతసేపా?'' చిరాగ్గా అడిగేడు వైశంపాయనుడు.

''ఎవరో ఒకావిడ చిన్నపిల్లాడితో వచ్చి ఏదో చెప్పుకుంటోంది. వింటున్నా!'' అంది సుబ్బాయమ్మ.

వైశంపాయనుడి గుండె జల్లుమంది. ''ఆమె చెప్పేవేమీ నమ్మకే బాబూ. నిజంగా నాకేం తెలియదు. ఒట్టు!'' అన్నాడు వైశంపాయనుడు కంగారుగా.

''ఇందులో మీకు తెలియాల్సిందేం ఉందీ? చూస్తేనే తెలుస్తోంది. తిండి తిప్పల్లేని ముష్టిదని. కాస్త అన్నం పెట్టి, ఓ పాత చీరిచ్చి పంపించా!!'' అంది సుబ్బాయమ్మ తాపీగా.

★